

ఉల్లి.. కురిపించేనా సిరి

ఉల్లి ధరలు బహిరంగ మార్కెట్లో స్థిరంగా లేకపోవడంతో రైతులు ఆలోచనలో పడ్డారు.

వివరాలు 8లో ▸

తల్లి మరణం తట్టుకోలేక..



ఒక్కరోజు వ్యవధిలో తల్లి, కొడుకు గుండె పోటుతో మృతి చెందిన విషాదకర ఘటన మండల కేంద్ర మైన కొడిపల్లిలో చోటు చేసుకుంది.

వివరాలు 8లో ▸

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాపన్నపేట(మెదక్): మండలంలో మంగళ వారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ నర్సింలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు పాయల జాతర ఏర్పాట్లలో భాగంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

న్యూస్‌రీల్

తొమ్మిదేళ్లలో కాని పనులు.. మూడు నెలల్లో చేస్తున్నాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

రామాయంపేట(మెదక్): తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ హయాంలో కాని అభివృద్ధి పనులు ఈ మూడు నెలల కాలంలో చేస్తున్నామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాలు, గిరిజన తండాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దామరచెరువు గ్రామాభివృద్ధికి రూ.రెండున్నర కోట్లు మంజూరు చేయించానని.. గత ఎమ్మెల్యే ఏ మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. అనంతరం డబుల్ బెడ్రూం కాలనీకి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అలాగే కాట్రియాల తండా, దంతేపల్లి తండా, కిషన్‌తండా, సుభాశ్ తండాలో పర్యటించి సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకు ముందు దామరచెరువు మాజీ సర్పంచ్ శివప్రసాదరావు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, ముత్యంరెడ్డి, ఎంపీటీసీలు నాగులు, శ్రీలత, పార్టీ జిల్లా కోఆర్డినేటర్ విప్లవ్‌కుమార్, జిల్లా నాయకులు శ్రీధర్‌రెడ్డి, హన్మంతరావు, పాండు, బన్సీలాల్, రాజు నాయక్, తార్యా నాయక్, రవీందర్, కౌన్సిలర్లు యాదగిరి, సుందర్‌సింగ్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నీటి యాజమాన్యంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఏఓ గోవింద్

హవేళీఘణాపూర్(మెదక్): మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో నేల, నీటి యాజమాన్యంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ విషయంపై ఏఈఓలు గ్రామాల్లోకి వెళ్లి అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ సూచించారు. సోమవారం మెదక్ మండల పరిధిలోని ర్యాలమడుగు రైతు వేదికలో జిల్లాలోని ఆయా క్లస్టర్లకు చెందిన ఏఈఓలకు అవగాహన కల్పించారు. నీటి సంరక్షణ, పొలాల్లో నీటి యాజమాన్యం, సేంద్రియ వ్యవసాయంతో నీటి వినియోగం, సూక్ష్మ నీటి పారుదలపై శిక్షణ ఇచ్చారు.

ఏడుపాయల హుండీ ఆదాయం రూ. 49 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల హుండీ ఆదాయం రూ.49,06,854 వచ్చినట్లు ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం గోకుల్‌షెడ్‌లో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శివరాజ్ సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, ఎస్‌ఐ నరేష్ పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారు



మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

చిన్నశంకరంపేట(మెదక్): కేసీఆర్ కుటుంబానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కుటుంబంలో అహంకారం పెరిగిందన్నారు. రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు భవిష్యత్‌లో జిల్లాస్థాయి పదవులు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పండరిగౌడ్, శ్రీమన్‌రెడ్డి, ప్రభాకర్, గోపాల్‌రెడ్డి, నరేందర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా సాన సత్యనారాయణను ప్రకటించారు.

‘ఏడుపాయల’ రూపు మారేనా?



ఏడుపాయల దేవస్థానం

- కొత్త ప్రభుత్వంపైనే కోటి ఆశలు
- టెంపుల్ టూరిజం డెవలప్‌మెంట్‌కు చర్యలు
- ఆశగా ఎదురుచూస్తున్న భక్తులు, పర్యాటకులు



మెదక్: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రమైన ఏడుపాయల అభివృద్ధికి అడుగులు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం టెంపుల్ టూరిజం డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇటీవల అధికారులను ఆదేశించిన విషయం విదితమే. అలాగే ఎండోమెంట్ మంత్రిగా కొండా సురేఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉండడంతో ఆశలు మెండుగా కనిపిస్తున్నాయి. ఎమ్మెల్యే రోహిత్‌రావు సైతం ఏడుపాయల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు.

మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధి నాగ్సానిపల్లి సమీపంలో మంజీరా నది ఏడుపాయల మధ్య ఉన్న వనదుర్గా మాత ఆలయం రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా బాసిల్లుతోంది. సమీపంలోనే వనదుర్గా ప్రాజెక్ట్ (ఘనపూర్ ఆనకట్ట) ఉండడం, మంజీరా ఏడుపాయలుగా చీలి ప్రవహిస్తుండడంతో పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. ఏడాది పొడవునా తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి తరలివస్తున్నారు. ప్రతి ఆదివారం 10 నుంచి 20 వేల మంది భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్నారు. ఇక ఏటా మాఘ అమావాస్య సందర్భంగా దాదాపు లక్ష మంది, మహాశివరాత్రి సందర్భంగా జరిగే జాతరకు ఎనిమిది లక్షల మంది భక్తులు తరలివస్తారు.

ఆదాయం ఫుల్.. వసతులు నిల్

కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయం, ఒడి బియ్యం సేకరణ టెండర్లు, లడ్డూ, పులిహోరా విక్రయం, ప్రత్యేక దర్శనం టికెట్లు, వాహన పూజ, హుండీలో భక్తులు సమర్పించే కానుకల ద్వారా ఏడుపాయల ఆలయానికి ఏటా సుమారు రూ. 6 నుంచి రూ. 8 కోట్ల ఆదాయం సమకూరుతోంది. అంతేగాక ఏటా శివరాత్రి జాతర నిర్వహణకు ప్రభుత్వం రూ. కోటి నుంచి రూ. 2 కోట్ల వరకు నిధులు మంజూరు చేస్తోంది. అయితే రూ. కోట్లలో ఆదాయం వస్తున్నా భక్తుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడం లేదు. దాతలు నిర్మించిన సత్రాలు, షెడ్‌లు 50 వరకు ఉండగా ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో భక్తులు బస చేసేందుకు, ఫంక్షన్స్ నిర్వహించేందుకు సరిపోవడం లేదు. దీంతో ఖాళీ ప్రదేశాల్లో కిరాయి టెంట్లు వేసుకొని ఉండాల్సి వస్తోంది.

సత్వరం చేయాల్సిన పనులు

ఏడుపాయల్లో బస చేసేందుకు సత్రాలు, కాటేజీలు, శుభకార్యాలు నిర్వహించేందుకు విశాలమైన షెడ్‌లు, పర్మనెంట్ టాయిలెట్లు, స్నానఘట్టాలు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులు, డ్రైనేజీ సిస్టం, తాగునీటి వసతి, పార్కింగ్ ఏరియా తదితర సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ప్రభుత్వం తగినన్ని నిధులు మంజూరు చేస్తేనే ఇలాంటి పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది.

అమలుకు నోచుకోని హామీ

జిల్లాలోని వనదుర్గా ప్రాజెక్టు, ఏడుపాయల ఆలయ ప్రాంగణాన్ని అన్ని హంగులతో పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు రూ.1,500 కోట్లు మంజూరు చేస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చింది. అందులో భాగంగా ముందుగా రూ.100 కోట్లు మంజూరు చేస్తూ జీఓ విడుదల చేసినా నిధులు మాత్రం రాలేదు.





ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

ప్రజావాణికి 81 అర్జీలు

సత్వర పరిష్కారం చూపాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

మెదక్ కలెక్టరేట్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అర్జీలు వెల్లువెత్తాయి. జిల్లాలోని వివిధ మండలాల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ తమ సమస్యలపై 81 వినతులు అందజేశారు. వాటిని పరిశీలించిన కలెక్టర్ రాజర్షిషా సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా మైనింగ్ అధికారి జయరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు మార్చిలో జరుగనున్న పదో తరగతి పరీక్షలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం పల్స్ పోలియోపై జిల్లా టాస్క్‌ఫోర్స్ మీటింగ్ (డీటీఎఫ్) నిర్వహించారు. మార్చి 3, 4, 5 తేదీల్లో నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

- కొల్చారం మండలం ఎనగండ్ల పంచాయతీ సర్పంచ్ పదవికి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని ఎస్సీ సంఘం నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 20 ఏళ్లుగా రిజర్వేషన్ లేనందున ఎస్సీలకు అవకాశం లేకుండా పోయిందని వాపోయారు.
- జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయం దుకాణ సముదాయంలో పేరుకుపోయిన ఆస్తి పన్ను వెంటనే వసూలు చేయాలని.. 20 ఏళ్లుగా పన్నులు చెల్లించకపోవడంతో రూ.15 లక్షల బకాయిలు ఉన్నాయని ఐక్య కార్యాచరణ సాధన సమితి నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే ఆలయ ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నట్లు ఆరోపణలున్నాయని.. వెంటనే బహిరంగ పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.
- కాళేశ్వరం కాల్వల నిర్మాణంతో భూములు కోల్పోతున్నామని, వెంటనే కాల్వ రద్దు చేయాలని మనోహరాబాద్, శివ్వంపేట, నర్సాపూర్ మండలాల రైతులు ఫిర్యాదు చేశారు. భూములు కోల్పోతే మా కుటుంబాలు రోడ్డున పడుతాయని వాపోయారు.
- జిల్లా కేంద్రంలోని ప్రధాన రోడ్లు, ఇతర ప్రాంతాల్లో నాటిన కోనోకార్పస్ మొక్కలు వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

రైల్వేస్టేషన్‌కు మరిన్ని హంగులు

- ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి
- ‘అమృత్ భారత్’లో ఎంపిక కావడంపై హర్షం



అమృత్ భారత్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి, కలెక్టర్ తదితరులు

మెదక్: అమృత్ భారత్ పథకంలో మెదక్ రైల్వేస్టేషన్ ఎంపిక కావడం శుభ పరిణామమని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. రైల్వేస్టేషన్లను ఆధునీకరించే ఉద్దేశంతో కేంద్రం ప్రవేశపెట్టిన అమృత్ భారత్ స్టేషన్‌కు ప్రధాని నరేంద్రమోదీ సోమవారం వర్చ్యువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. మెదక్ రైల్వేసాధన సమితి నాయకులతో పాటు ఎంతోమంది నాయకులు మెదక్‌కు రైలు తేవడానికి శ్రమించారన్నారు. అమృత్ భారత్ పథకంలో మెదక్ స్టేషన్‌ను ఎంపిక చేసి రూ.15 కోట్లు కేటాయించినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. మెదక్ రైల్వేస్టేషన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించారని, దీంతో జిల్లా ప్రజలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. అలాగే వ్యవసాయం, పారిశ్రామిక, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. అనంతరం వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రైల్వే అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన



అసైన్డ్ భూములను పరిశీలిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట/వెల్దుర్తి(తూప్రాన్): పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తిస్తున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మండలంలోని సూరారం శివారులో అసైన్డ్ భూములను టీఎస్ఐఐసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకేచోట ఐదు వందల ఎకరాల స్థలం అందుబాటులో ఉన్న ప్రదేశాలను గుర్తిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఆర్డీఓ జయచంద్రారెడ్డి, తహసీల్దార్ మన్నన్, ఆర్ఐ చంద్రశేఖర్ ఉన్నారు. అలాగే మాసాయిపేట మండలం అచ్చంపేట, హకీంపేట, రామంతాపూర్ శివారులో సీలింగ్ భూములను పరిశీలించారు. అయితే మాసాయిపేట మండల పరిధిలో ఫార్మా విలేజ్ ఏర్పాటు చేయవద్దని అధికారులకు ఎంపీటీసీ కృష్ణారెడ్డితో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు విన్నవించారు. అలాగే చేగుంట మండలంలోని బీ కొండాపూర్ శివారులో ఫార్మా విలేజ్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన నిర్వహించారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం



రేపటి నుంచి పరీక్షలు ప్రారంభం

మెదక్ కలెక్టరేట్: రేపటి నుంచి మార్చి 16వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్ నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 30 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని, విద్యార్థులు ఉదయం 8 గంటల వరకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. జనరల్ విభాగంలో 13,172 మంది ఒకేషనల్ విభాగంలో 656 మంది విద్యార్థులు పరీక్షలు హాజరుకానున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలోని హైపవర్ కమిటీతో పాటు జిల్లా పరీక్షల కమిటీ పరీక్షలను పర్యవేక్షిస్తారని వివరించారు. పరీక్షలను సజావుగా నిర్వహించడానికి అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఏవైనా సందేహాలుంటే 96036 15652 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

మెదక్ కలెక్టరేట్: అంగన్‌వాడీ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులకు డిసెంబర్, జనవరి నెలల వేతనాలు చెల్లించకుంటే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలకు వేతనాలు చెల్లించి మెదక్ జిల్లాకు చెల్లించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

గంజాయితో భవిష్యత్ నాశనం

ఎస్పీ డాక్టర్ బాలస్వామి



మెదక్ మున్సిపాలిటీ: గంజాయి సేవించి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్పీ డాక్టర్ బాలస్వామి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణ, వాటి నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై మాట్లాడారు. చాక్లెట్ల రూపంలోకి మార్చి చిన్న పిల్లలను సైతం గంజాయికి బానిసలుగా మార్చుతున్నారని వాపోయారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడుతూ చోరీలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. పిల్లల తల్లిదండ్రులు వారి ప్రవర్తనను గమనిస్తూ ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల సమాచారం ఉన్నవారు తమ వంతు బాధ్యతగా వెంటనే జిల్లా పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 8712657888కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. అనంతరం ప్రజావాణిలో వినతులు స్వీకరించారు. చట్ట ప్రకారం ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు.

బోనం.. వైభవం



కొల్చారం మండలంలోని రాంపూర్‌లో పెద్దమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం అమ్మవారి కల్యాణోత్సవం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.
– కొల్చారం (నర్సాపూర్)

త్వరలో వడ్డీ లేని రుణాలు

- మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి కృషి
- హుస్నాబాద్ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు
- పొద్దుతిరుగుడు, మొక్కజొన్న రైతులను ప్రోత్సహిస్తాం
- మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్: మౌలిక సదుపాయాలు, అంతర్గత రోడ్లు, ఉపాధి పెరుగుదల, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇచ్చే కార్యక్రమాలను త్వరలో ప్రారంభిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అంతకు ముందు హుస్నాబాద్ నుంచి మహ్మదాపూర్ వరకు రూ.2.50కోట్ల వ్యయంతో నిర్మించే బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. డయాలసిస్ సెంటర్‌తో పాటు 200 పడకలకు అప్‌గ్రేడ్ కావాల్సిన వసతులు, సౌకర్యాల గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో తడి చెత్త, పొడి చెత్త బుట్టలను మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మన ఆరోగ్యాలను కాపాడుకోవచ్చన్నారు. గతంలో మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు వడ్డీ లేని రుణాలు ఎంతగానో తోడ్పడ్డాయన్నారు. త్వరలో వడ్డీ లేని రుణాల కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మొదటి దశలో అందిస్తామన్నారు. పొద్దుతిరుగుడు క్వింటాలుకు రూ.6,760 మద్దతు ధర ఉందన్నారు. ప్రతి ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. పొద్దుతిరుగుడు పంటను రైతులు ఎక్కువగా సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్‌చైర్ పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమష్టి కృషి అవసరం

సీనియర్‌ శాస్త్రవేత్త డాక్టర్‌ విజయ్‌ తల్లాప్రగడ



మాట్లాడుతున్న డాక్టర్‌ విజయ్‌

పటాన్‌ చెరు: కచ్చితమైన వాతావరణ అంచనాలకు అన్ని విభాగాల నుంచి సమష్టి కృషి అవసరమని అమెరికాలోని పర్యావరణ మోడలింగ్‌ కేంద్రం సీనియర్‌ శాస్త్రవేత్త డాక్టర్‌ విజయ్‌ తల్లాప్రగడ స్పష్టీకరించారు. గీతం స్కూల్‌ ఆఫ్‌ సైన్స్‌లోని భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'వాతావరణం, వాతావరణం యొక్క సంఖ్యాపరమైన అంచనాలో పురోగతి సవాళ్లు–అవకాశాలు' అనే అంశంపై సోమవారం కార్యక్రమం నిర్వహించారు. విజయ్‌ తల్లా ప్రగడ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కచ్చితమైన వాతావరణ అంచనాల సవాళ్లను పరిష్కరించడానికి భావితరం శాస్త్రవేత్తలకు శిక్షణ ఇచ్చే ప్రాముఖ్యతను వివరించారు. పలువురు అధ్యాపకులు, విద్యార్థులు సంధించిన ప్రశ్నలకు సవివర జవాబులిచ్చి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకుడు ప్రొఫెసర్‌ విశ్వం, కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్‌ ఐ.వీ సుబ్బారెడ్డి, పలువురు భౌతికశాస్త్ర అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల సిబ్బంది

సిద్దిపేట ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్‌)లోని వాణిజ్యశాస్త్ర, మేనేజ్‌మెంట్‌ డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో ''రీసెర్చ్‌ మెథడాలజీ అండ్‌ అవెన్యూస్‌ ఫర్‌ ఫండింగ్‌'' అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి కార్యశాల నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ప్రసాద్‌ తెలిపారు. సోమవారం కళాశాలలో కార్యశాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ ప్రసాద్‌ మాట్లాడుతూ.. మార్చి 22, 23 తేదీల్లో జాతీయ స్థాయి కార్యశాలను కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. దీంతో అధ్యాపకులకు, విద్యార్థులకు ఎంతగానో లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో కార్యశాల నిర్వాహకులు గుగులోత్‌ రాజునాయక్‌, వాణిజ్య శాస్త్ర విభాగధిపతి గోపాల సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో..

ఇద్దరికి ఐదేళ్ల జైలు

పటాన్‌చెరు టౌన్‌: హత్యాయత్నం కేసులో ఇద్దరికి కోర్టు శిక్ష విధించిన ఘటన బీడీఎల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. బీడీఎల్‌ సీఐ రవీందర్‌ రెడ్డి కథనం ప్రకారం.. రామచంద్రపురం పరిధిలోని వెలిమల గ్రామానికి చెందిన రాజు గతంలో సొంత బాబాయ్‌ లక్ష్మయ్యపై సోదరుడు మహేశ్‌తో కలిసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు బీడీఎల్‌ పోలీసులకు రాజు, మహేశ్‌పై ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్‌ఐ వెంకట్‌ రెడ్డి కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌ తరలించారు. ఈ క్రమంలో సోమవారం నిందితులు ఇద్దరిని సంగారెడ్డి కోర్టులో ఏఎస్‌జే న్యాయమూర్తి రాధాకృష్ణ చౌహాన్‌ ఎదుట హాజరుపర్చగా ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.1,000 చొప్పున జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఉల్లి.. కురిపించేనా సిరి

- ప్రారంభమైన కోతలు
- ముమ్మరంగా మార్కెట్‌కు తరలింపు
- స్థిరంగా ఉండని మార్కెట్‌ ధర
- రైతుల్లో నెలకొన్న ఆందోళన
- క్వింటాల్‌కు రూ.వెయ్యి నుంచి రూ.1,600

మనూరు(నారాయణఖేడ్‌): ఉల్లి సాగు రైతుల్లో రోజు రోజుకూ ఆశలు చిగురిస్తున్నాయి. మూడు నెలల కిందట వేసిన పంట పూర్తిస్థాయిలో చేతికి వచ్చింది. దీంతో రైతులు పంటను మార్కెట్‌కు తరలించేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. కానీ ఉల్లి ధరలు స్థిరంగా లేకపోవడంతో కొంత ఆలోచనలో పడ్డారు. ఏ క్షణం ఉల్లి రేటు పడిపోతుందో, పెరుగుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. పంట మార్కెట్‌కు తరలే వరకు మద్దతు ధర ఏ మేర పలుకుతుందో అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రస్తుతం మార్కెట్‌లో వారం రోజులుగా రూ.వెయ్యి నుంచి మొదలు రూ.1,600 వరకు క్వింటాల్‌ చొప్పున మార్కెట్‌లో ధర వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వస్తున్న ధరతో తమకు కొద్ది మేర మేలు కలుగుతుందనే ఆశల్లో రైతులు ఉన్నారు. దీంతో చేతికొచ్చిన పంటను పూర్తి స్థాయిలో మార్కెట్‌కు తరలించేందుకు ఉల్లి కోతలను ముమ్మరం చేశారు. ఓ వైపు కూలీలకు పూర్తి స్థాయిలో చేతి నిండా పని దొరకగా అటు సాగు చేసిన రైతులు తమకు మద్దతు ధర బాగా వస్తే బాగుంటుందనే ఆశల్లో ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలింపు

జిల్లాలోనే నారాయణఖేడ్‌ పరిధిలోని మనూరు మండలం ఉల్లి సాగులో ప్రసిద్ధి. ఇక్కడి రైతులు ఉల్లి సాగులో దిట్టగా పేరు గాంచారు. ఖేడ్‌ పరిధిలో సాగుచేసిన ఉల్లిని హైదరాబాద్‌ మార్కెట్‌కు తలిస్తుంటారు. రోజు వారీగా పదుల సంఖ్యలో ఉల్లి లారీలు లోడింగ్‌ అయ్యి మార్కెట్‌కు తరలుతున్న దృశ్యాలే కనిపిస్తుంటాయి. ఖేడ్‌ డివిజన్‌ పరిధిలో దాదాపుగా 1,800 ఎకరాలకు పైగా ఉల్లి సాగు ఉంటుందని హార్టికల్చర్‌ అధికారులు పేర్కొంటున్నారు.



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఉల్లి



లారీలో ఉల్లి లోడ్‌ చేస్తున్న కూలీలు

ఎకరాకు 80 నుంచి వంద క్వింటాళ్లు

ఎకరా భూమిలో 80 నుంచి వంద క్వింటాళ్ల వరకు ఉల్లి దిగుబడి వస్తుందని స్థానిక రైతులు పేర్కొంటున్నారు. సాగు ఖర్చు రూ.50 వేల వరకు వస్తుందని చెబుతున్నారు. కాగా ప్రస్తుత ధర మరి కాస్తా పెరిగితే తమ కష్టానికి మంచి ఫలితం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

ఏ ధర ఉంటుందో తెలీదు



ఉల్లి సాగు చేసిన రైతులకు ఎప్పుడు ఎలాంటి ధర వస్తుందో తెలియని పరిస్థితి. వారం రోజుల్లో ధర పెరగడం, తగ్గడం కనిపించింది. రూ.వెయ్యి నుంచి 1,600 వరకు ధర పలుకుతోంది. మళ్లీ పెరగవచ్చు లేక తగ్గవచ్చు. ఉన్నకాడికి పంటను మార్కెట్‌కు తరలించడమే మంచిదని లోడింగ్‌ చేస్తున్నాం.

–నరేశ్‌, రైతు, పైడిపల్లి

ఈ ఏడాది సాగు బాగుంది



ఈ ఏడాది మండలంలో ఉల్లి సాగు బాగుంది. వాతావరణం ఉల్లి రైతులకు సహకరించింది. ముఖ్యంగా చెడు వర్షాలు కురవలేదు. తె గుళ్ల సైతం ఈ ఏడాది తక్కువగానే రావడం కన్పించింది. ఉల్లి సాగు చేస్తున్న రైతులకు హార్టికల్చర్‌ అధికారులతో కో ఆర్డినేషన్‌ చేసుకుంటూ వారికి సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది.

– శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, మనూరు

మోసపూరిత హామీలు నమ్మొద్దు

- ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా బీజేపీ పాలన
- పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌

గజ్వేల్‌రూరల్‌: ప్రజలు మోసపూరిత హామీలు నమ్మొద్దని, ప్రజల సంక్షేమం, దేశ అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌ పిలుపునిచ్చారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్పయాత్రలో భాగంగా సోమవారం గజ్వేల్‌లోని పీఎస్‌ఆర్‌ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 5 క్లస్టర్‌లలో విజయ సంకల్ప యాత్ర కొనసాగుతుందన్నారు. ఎన్నికలకు ముందు గజ్వేల్‌ ప్రజలను కలుస్తానని చెప్పిన కేసీఆర్‌ ఎన్నికలు పూర్తి అయ్యి నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఎందుకు కలవలేదని ప్రశ్నించారు. ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలోని ముంపు బాధితులకు ఇళ్లు, ప్లాట్లు, పరిహారం, ప్యాకేజీలు పూర్తిస్థాయిలో అందలేదని, ఇప్పుడు ముంపు గ్రామాల ప్రజా సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ ప్రకటించిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్పపార్టీ ప్రకటించి ఏ ఒక్క హామీ కూడా ఇంతవరకు అమలు కాలేదని విమర్శించారు. కాగా అధిష్టానం ఆదేశిస్తే మల్కాజ్‌గిరి పార్లమెంటు నుంచి ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఈటల రాజేందర్‌ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ బీజేవైఎం నాయకులు వెంకటరమణ, గురువారెడ్డి, రాంరెడ్డి, కుడిక్యాల రాములు, శ్రీనివాస్‌, సాయిబాబా, నత్తి శివకుమార్‌, అశోక్‌గౌడ్‌, మనోహర్‌యాదవ్‌, మహేశ్‌, సురేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 4 కోట్ల ఇళ్లు నిర్మాణం

తొగుట(దుబ్బాక): పేదలకు 4 కోట్ల ఇళ్లు నిర్మించిన ఘనత మోదీకి దక్కిందని, రాష్ట్రంలో కేసీఆర్‌ పేదలకు డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తానని మోసం చేశారని ఈటల రాజేందర్‌ విమర్శించారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా మండల కేంద్రంలో సోమవారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేయిచేయి కలిసి మూడోసారి ప్రధానిగా మోదీని గెలిపిద్దామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులను కేసీఆర్‌ పక్కదారి పట్టించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, వీధిలైట్లతో పాటు గ్రామ పంచాయతీ సఫాయి కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించిన ఘనత మోదీకి దక్కిందన్నారు. మల్లన్న సాగర్‌ నిర్మించి 14 గ్రామాల ప్రజలను రోడ్డున పడేశారని బీఆర్‌ఎస్‌ పై మండిపడ్డారు. అంతకు ముందు మండలంలోని చందాపూర్‌ వద్ద ఈటల రాజేందర్‌ను కార్యకర్తలు గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మెదక్‌ పార్లమెంట్‌ ఇన్‌చార్జి బస్వ నర్సయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేశ్‌, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విభీషన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చంద్రం, ఎంపీటీసీ నర్సింలు, నాయకులు శ్రీనివాస్‌, నర్సింలు యాదవ్‌, స్వామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీన్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్‌

గాంధీ విగ్రహం ధ్వంసం

సిద్దిపేట మండలం
బక్రిచెప్యాల గ్రామంలో ఘటన

సిద్దిపేటఅర్బన్‌: గుర్తు తెలియని దుండగులు గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన సిద్దిపేట అర్బన్‌ మండలం బక్రిచెప్యాల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని బస్టాండ్‌ వద్ద ఉన్న గాంధీ విగ్రహాన్ని ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయగా, సోమవారం ఉదయం గ్రామస్తులు గుర్తించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్‌ సలీం, గ్రామ స్పెషల్‌ ఆఫీసర్‌ రాజేశం గ్రామానికి చేరుకొని ఘటనపై గ్రామస్తులను ఆరా తీశారు. ఘటన విషయం తెలుసుకున్న త్రీటౌన్‌ పోలీసులు విచారణ చేశారు. గ్రామంలోని బాలవికాస ప్లాంట్‌ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. అవి పని చేయకపోవడంతో ఇతర మార్గాల ద్వారా నిందితులను గుర్తించే ప్రయత్నం చేయనున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. విగ్రహాన్ని ఎంపీటీసీ రంగం, గ్రామ యువకులు శ్రీనివాస్‌, యాదగిరి, ముబీన్‌, నర్సింహులు, అనిల్‌, హరీశ్‌, శ్రీనాథ్‌, నాగయ్య, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, గంప శ్రీనివాస్‌, ఇతర నాయకులు పరిశీలించారు.



ధ్వంసమైన గాంధీ విగ్రహం

మద్యం మత్తులో..

గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయంలో గ్రామంలో విచారణ చేసి కొన్ని విషయాలను తెలుసుకున్నామని త్రీటౌన్‌ సీఐ విద్యాసాగర్‌ తెలిపారు. విగ్రహానికి సమీపంలోనే గ్రామంలో బెల్టు షాపులు ఉండడంతో అర్ధరాత్రి వరకు మద్యం సేవించి మత్తులో ఇలాంటి ఘటనకు పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్టు మృతి

మృతుడు మెదక్‌ జిల్లా రంగాయపల్లి వాసి



అహ్మద్‌(ఫైల్‌)

వర్గల్‌(గజ్వేల్‌): కారు–బైక్‌ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో బైకిస్టు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం వర్గల్‌ మండలం మీనాజీపేట శివారులో చోటు చేసుకుంది. గౌరారం ఎస్సై శివకుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌ జిల్లా మనోహరాబాద్‌ మండలం రంగాయపల్లికి చెందిన మహ్మద్‌ అహ్మద్‌(24) సోమవారం సాయంత్రం స్వగ్రామం నుంచి బైక్‌ మీద మీనాజీపేట వైపు వెళ్తుండగా, మీనాజీపేట వైపు నుంచి రంగాయపల్లి వైపు వెళ్తున్న కారు ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన అహ్మద్‌ను 108 అంబులెన్స్‌తో తూప్రాన్‌ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి నెలరోజుల క్రితమే వివాహం జరిగినట్లు సమాచారం. ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

కోతుల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్‌): మహిళపై కోతులు దాడి చేయడంతో తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధి బిజ్లీపూర్‌ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సర్జన సరిత బట్టలు ఆరేసేందుకు భవనం పైకి వెళ్లగా కోతుల గుంపు దాడి చేయడంతో మెట్ల పై నుంచి కింద పడింది. ఇనుప రాడ్లు ఆమె తలకు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గోమారంలో ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

45 మేకలు మృత్యువాత



మృత్యువాత పడిన మేకలు

చిన్నశంకరంపేట(మెదక్‌): మేతకు వెళ్లి ఇంటికి తిరిగొస్తుండగా 45 మేకలు మృత్యువాత పడిన ఘటన నార్సింగి మల్లన్నగుట్ట అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లో వెళ్తే.. వల్లాభాపూర్‌ గ్రామానికి చెందిన బత్తుల సాయిలు రోజు మాదిరిగానే అటవీ ప్రాంతంలో మేకలను మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికొచ్చే ముందు చెరువులో నీటిని తాగిన మేకలు మల్లన్నగుట్ట పక్కన రహదారి వెంట నురగలు కక్కడం గమనించాడు. వెంటనే మేకల కాపరి నార్సింగి పశువైద్యాధికారి జీవన్‌ప్రతాప్‌కు ఫోన్‌ చేయగా కొన్ని మందులు సూచించాడు. మందులు తీసుకొచ్చి వాడినప్పటికీ ఫలితం దక్కలేదు. అనంతరం ఒక్కొక్కటి రాత్రి 9 గంటల వరకు 45 మేకలు మృత్యువాత పడ్డాయని కాపరి సాయిలు తెలిపారు. అటవీ ప్రాంతంలోని చెరువు నీటిలో ఏదైనా విషప్రయోగం జరిగి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్థానిక వైద్యాధికారి జీవన్‌ ప్రతాప్‌ మాట్లాడుతూ.. ఉదయం గొర్రెలను పరిశీలిస్తేనే మృత్యువాతకు గల కారణాలు తెలుస్తామని, ప్రభుత్వ పరమైన సాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

గజ్వేల్‌రూరల్‌: ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని బంగ్లా వెంకటాపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చిగురు స్వామి(35)కి భార్య స్రవంతి, ఆరేళ్లలోపు కొడుకులు వంశీ, సన్వేశ్‌ ఉన్నారు. స్వామి కూలీ పనులకు వెళ్తూ తమకున్న కొద్దిపాటి భూమిలో పంట సాగు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కుటుంబ పోషణ, పంటల సాగు కోసం సుమారు రూ. 2 లక్షల వరకు అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన స్వామి సోమవారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి బయటకు వెళ్లి గ్రామ సమీపంలోని పెద్ద చెరువుకట్ట వద్ద ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటి తర్వాత ఇదే మార్గంలో వెళ్తున్న గ్రామస్తులు గమనించి మృతుడు స్వామి కుటుంబ సభ్యులకు, బేగంపేట పోలీసులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బేగంపేట ఎస్‌ఐ రవికాంతరావు తెలిపారు.

భార్యతో ఫోన్‌లో గొడవపడి ..



సమోధర్‌ మృతదేహం

పటాన్‌చెరు టౌన్‌: ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బీడీఎల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌ రెడ్డి కథనం ప్రకారం... పశ్చిమ బెంగాల్‌కు చెందిన పింటూ సమోధర్‌(24) బతుకుదెరువు కోసం వారం రోజుల కిందట పటాన్‌చెరు మండల పరిధిలోని ఘనపూర్‌కి వచ్చాడు. ఇక్కడే స్థానికంగా ఉంటున్న భవ్య వెంచర్‌లో కాంపౌండర్‌ గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి స్వరాష్ట్రంలో ఉండే భార్యతో ఫోన్‌లో మాట్లాడుతూ గొడవపడ్డాడు. కొద్దిసేపటికే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం తోటి కార్మికులు చూసి పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడి బంధువు భూపాల్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెట్రోల్‌ బంకులో విద్యుదాఘాతం

ఇద్దరికి తీవ్ర గాయాలు

కొల్చారం(నర్సాపూర్‌):విద్యుదాఘాతంతో పెట్రోల్‌ బంకులో పనిచేస్తున్న ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారు జీపీపీ ఫీలింగ్‌ మిషన్‌ (హెచ్‌పీ పెట్రోల్‌ బంకు)లో సోమవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని చిన్నఘనపూర్‌ గ్రామానికి చెందిన కుమార్‌, అంసాన్‌ పల్లి గ్రామానికి చెందిన మహేందర్‌ పెట్రోల్‌ బంకులో పంపు కార్మికులుగా పని చేస్తున్నారు. యాజమాన్యం ఆదేశంతో బంకు పైకప్పు ఐరన్‌ స్లాండ్‌ వేసుకొని మరో యువకుడు శుభ్రం చేస్తుండగా కుమార్‌, మహేందర్‌ సపోర్టుగా పట్టుకున్నారు. స్టాండ్‌ను మరో వైపుకు జరుపుతున్న క్రమంలో విద్యుత్‌ వైర్లు తగిలి కరెంట్‌ షాక్‌ కొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని మెదక్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్‌ గౌస్‌ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగినట్టు బాధితుల కుటుంబ సభ్యులు ఆరోపించారు.




గాయపడ్డ యువకులు

ఇల్లు దగ్ధం

దుబ్బాక: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన ఘటన దుబ్బాక పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. ఆర్‌ఐ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ..దుబ్బాక పట్టణానికి చెందిన గాజుల నరేశ్‌ గురుకుల పాఠశాలలో టీజీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆలయంలో పూజలు చేయించడం కోసం ఉదయాన్నే ఇంటికి తాళం వేసి భార్యా పిల్లలతో కలిసి వెళ్లారు. ఒక్క సారిగా ఇంటిలో నుంచి మంటలు, దట్టమైనా పొగ రావడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. దాదాపు రూ.4 లక్షల పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని, కరెంట్‌ షాక్‌తోనే ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నట్లు ఆర్‌ఐ తెలిపారు.

తల్లి మరణం తట్టుకోలేక..

మరుసటి రోజే గుండెపోటుతో
కొడుకు మృతి



లలిత (ఫైల్‌)



నరేందర్‌ (ఫైల్‌)

కౌడిపల్లి(నర్సాపూర్‌): తల్లి మరణం తట్టుకోలేక కొడుకు మృతి చెందాడు. ఒక్కరోజు వ్యవధిలో తల్లి, కొడుకు గుండెపోటుతో మృతి చెందిన విషాదకర ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లి గ్రామానికి చెందిన దొంత లలిత(75) ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో కూతురు ఇంటి వద్ద గుండెపోటు రావడంతో మృతి చెందింది. మృతురాలికి కొడుకు దొంత నరేందర్‌(45)తోపాటు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. బంధువులు కుటుంబసభ్యులు సమక్షంలో ఆదివారం సాయంత్రం కౌడిపల్లిలో అంత్యక్రియలు పూర్తి చేశారు. అప్పటికే తల్లి మరణం తట్టుకోలేక దిగులుగా ఉన్న నరేందర్‌ అర్ధరాత్రి దాటిన తర్వాత అస్వస్థతకు గురయ్యాడు. స్థానికంగా పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడి నుంచి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఒక్కరోజు వ్యవధిలోనే తల్లీకొడుకు మృతి చెందడంతో కుటుంబంలో, గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

వివాదాస్పదంగా విగ్రహ ఏర్పాటు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని చేప్యాల క్రాస్‌ రోడ్డులో దివంగత మాజీ మంత్రి ముత్యం రెడ్డి విగ్రహాన్ని కాంగ్రెస్‌ నాయకులు రాత్రికి రాత్రే ఏర్పాటు చేయడం వివాదాస్పదంగా మారింది. ప్రొ.జయశంకర్‌ విగ్రహం ఏర్పాటుకు గతంలో శంకుస్థాపన చేసిన స్థలంలోనే మాజీ మంత్రి ముత్యం రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై బీఆర్‌ఎస్‌ నాయకులు సోమవారం ఆందోళనకు దిగారు. ముత్యం రెడ్డి విగ్రహాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్‌ చేస్తూ పార్టీ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి నాయకులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్‌ వీరేశ్‌కు వినతిపత్రాన్ని అందించారు. దుబ్బాక కాంగ్రెస్‌ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఈ విషయంలో కలుగజేసుకొని ముత్యం రెడ్డి విగ్రహాన్ని అక్కడి నుండి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకుడు సూకూరి లింగం, కో ఆప్షన్‌ మెంబర్‌ ఎండీ. అహ్మద్‌, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్‌ వల్లాల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ గొట్టం భైరయ్య, గొట్టం యాదాకృష్ణ, మాచపురం యాదగిరి, నితిన్‌, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వీరేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

సారూ.. నేను బతికే ఉన్నా

పింఛన్‌ కోసం కాళ్లరిగేలా
తిరుగుతున్న శంకర్‌

పాపన్నపేట(మెదక్‌): 'నేను సావ లేదు సారూ.. బతికే ఉన్నాను సూడూ' అంటూ ఓ వ్యక్తి పింఛన్‌ కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా కనికరించే నాథుడే కరువయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. పాపన్నపేటకు చెందిన సంగరి శంకర్‌ (62)కు భార్య కళావతి, ముగ్గురు కొడుకులు ఉన్నారు. కొడుకుల పెళ్లిళ్లు కాగానే పట్నం వెళ్లిపోయారు. గ్రామంలో బతుకు దెరువు భారంగా మారడంతో పట్నం వెళ్లి వాచ్‌ మెన్‌గా పనికి కుదిరాడు. వయస్సు మీద పడడంతో ఇంటికి తిరిగొచ్చాడు. వృద్ధాప్య పింఛన్‌ కోసం దరఖాస్తు చేసుకోగా ఐడీ నంబర్‌తో పింఛన్‌ మంజూరి అయ్యింది. కానీ డబ్బులు రావడం లేదు. ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి స్టేటస్‌ చూపించగా, అతడు మరణించినట్లు ఉంది. దీంతో నేను బతికే ఉన్నాను మహాప్రభో అంటూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటు వాపోతున్నాడు. పింఛన్‌ మంజూరు చేసి తన కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.



పింఛన్‌ మంజూరైన పత్రంతో శంకర్‌

గిజిగాడు.. గూడు నిర్మాణంలో మొనగాడు

దుబ్బాకటౌన్‌: చెట్టుకొమ్మ చివరన అద్భుతమైన ఇంజనీరింగ్‌ పద్ధతిలో గిజిగాళ్లు కట్టుకున్న గూళ్లు చూడడానికి ఆశ్చర్యంగా కనిపిస్తున్నాయి. దుబ్బాక మండలం పెద్దచీకోడ్‌ శివారులో ఆరపల్లి సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ఓ పాత బావి అంచున తుమ్మ చెట్టు కొమ్మకు మండకు శత్రువు నుంచి రక్షణగా గిజిగాడు పక్షులు నిర్మించుకున్న గూళ్లు సాక్షి కెమెరా కంటపడింది.

